# పంచపాత్ర

## కే ఎ స్వే

### 5

(గతసంచిక తరువాయి)

లోపల మైనం కాగితంతో ఇంకో పార్శిలుంది. దానిమీద వొక కాగితం మడిచిపెట్టి వుంది.

కాగితం మడత విప్పి చదివేను–

"శ్రీ ఆనందరావుగారికి –

నమస్తే!

నేనెవరో మీకు తెలియదు. కాని మీరు నాకు తెలుసు.

నేను మీ పాఠకుణ్ణి, మీ అభిమానిని.

మిమ్మల్ని కలుసుకుందామని ఎన్నోసార్లు ప్రయత్నించేను గాని వీలుపడలేదు. మనమధ్య కొన్నివందలమైళ్ళ దూరంవుంది.

పరిచయం లేకపోయినా కొందరు కొందరు మనుష్యుల్ని గురించి మనం చాలా చాలా వూహించుకుంటాం. మీ గురించి నేను చాలా వూహించుకున్నాను. మీకు ఇతరులపట్ల దయాసానుభూతి ఎంతో ఎక్కువగా వుంటాయని నా నమ్మకం, అందుకు నేను చదివిన మీ రచనలే సాక్ష్యం.

ఎందుకో తెలీదుగాని, నాగురించి మీకు చెప్పుకోవాలని చాలా రోజులుగా అనుకుంటూనే వున్నాను. అది వీలుపడక తపన చేస్తున్నాను.

నేను పంపుతూన్న ఈ మైనపు కాగితం ప్యాకేజీలో నా మనస్సువుంది.

ఉలిక్కి పడ్తారనుకుంటాను.

అవును, నిజంగా – అక్షరాలా – నా మనసే మీకు పంపుతున్నాను.

ఒక పాఠకుడు ఒక రచయితకి తన మనసుని పార్శిల్‌గా పంపడంటే లోకం నమ్మలేకపోవొచ్చు. అట్లాంటి పని అసంభవం అని గొంతుచించుకొని అరవొచ్చు. కాని, సంభవమేనని నాకు తెలుసు. పార్శిల్ విప్పి చూస్తే మీకూ తెలుస్తుంది

అయితే నామనసులో ఏమేమున్నాయో, అవి ఎలావున్నాయో, నేను వేరే రాయనక్కరలేదు. కొంతసేపట్లో మీరే తెలుసుకుంటారు.

నామీదో నవల రాయమని మిమ్మల్ని నేనడగబోవడంలేదు, రాస్తే, వొద్దనబోవడమూ లేదు.

నాకొక్కటనిపించిందంటే – మీరు నా మనసును వొక్కసారి తిరగెయ్యండి, సానుభూతితో పరిశీలించండి, ఆ తరువాత దాన్ని మళ్ళీ తిప్పి పంపించెయ్యండి. మనసు మనసులో లేకపోతే ఎన్ని చిక్కులొస్తాయో మీకు తెలుసుగా!

మీ మైత్రిని దయని కోరుకునే –

అభిమాని,
చంద్రకాంత్"

పదేపదే చదువుకున్నాను ఆ వుత్తరాన్ని. ఎన్నిసార్లు చదివినా తలాతోకా తెలియలేదు.

నాకు అభిమానులంటూ వుండడమే విశేషం. వున్నా ఏ బస్సులోనో, రైల్లోనో, కాకతాళీయంగా తారసపడి మాట్లాడడమే తప్ప (–"మీ కథ–దానిపేరేమిటీ:- ఆఁ–అదే–చదివేన్సార్!–ఫరవాలేదు – బాగానేవుంది – ఆ హీరోయిన్‌కి ఇంకొంచెం అభిమానం వున్నట్టు రాసుంటే బాగుండేది–") ఇలా వుత్తరాలు రాసినవాళ్ళు అతి తక్కువ! తొలి వుత్తరంలోనే నా స్నేహాన్నీ, సానుభూతినీ కోరడం వొక చెప్పుకోదగిన విశేషమైతే – తన మనసునే పార్శిల్‌గా పంపించడం మరీ నమ్మదగని విశేషం!

కలగంటున్నానా? అనుకున్నాను.

ఎందుకైనా మంచిదని కళ్ళు నులుముకున్నాను.

చేయి గిల్లుకున్నాను.

మేజామీది పసుపురంగు మైనపు కాగితం ప్యాకేజీ అలాగే వుంది!

అందులో తన మనసుని పెట్టి పంపేనని చంద్రకాంత్ రాసేడు. లోకం ఆ సంగతి నమ్మదనీ రాసేడు! లోకం అంతటి దాకా ఎందుకూ?

— ఆకారం అంటూ ఎన్నడూ ధరించని ఒక భావన — 'మనసు' - నాకోసం ఒక మనిషి నాకు పార్సిల్‌గా పంపేడంటే నాకూ నమ్మబుద్ధి కావడంలేదు.

ఇదంతా ఒట్టి బడాయి - ఎందుకాకూడదూ ? ఆ పార్సిల్‌లో ఏ డైరీయో, ఉత్తరాలో పెట్టి—తన మనసు అని రొమాంటిగ్గా బ్లఫ్ చేస్తున్నాడేమో చంద్రకాంత్ !

ఇంకా ఆలోచనెందుకని - తొందరగా పార్సిల్ విప్పేను.

ఆశ్చర్యం !

అందులో వున్నది ఒక మనసే !

ఎన్నో కలలు కన్నాను నేను. నానా రకాలవి. నానా వర్ణాలవి, నానా రసాలవి. ఎన్నో వూహాల్లో తేలేన్నేను, ఎన్నో భావనా జగత్తుల్లో యథేచ్ఛగా విహరించేను ! కాని, ఇంత రమ్యమైన రహస్యమైన కలని నేనెప్పుడూ దర్శించలేదు ఇంత మధుర దారుణ(!)మైన వూహాల్లో నేనెప్పుడూ పల్టీలు కొట లేదు. ఇంత అసంబద్ధ అద్భుత రససిద్ధ భావనాలోకంలో నేనెప్పుడూ షికార్లు చెయ్యలేదు.

ఔను, నిజమే !

నాకంటికి అగుపిస్తోంది, నా కరస్పర్శకి అందుతోంది.

అది చంద్రకాంత్ మనసేనని—నాకెలాగోగాని—తెలుస్తోంది.

కాని, అన్నిటికన్నా విచిత్రం! అది వర్ణనాతీతంగా వుంది. పువ్వులా రాయిలా వుంది, పుస్తకంలా అద్దంలా వుంది. తెల్లగా నల్లగా వుంది. ఒక్కొక్కప్పుడు అన్నిరంగులు, ఒక్కొక్కప్పుడు నిర్వర్ణం! అదేదో ఆల్బంలా వుంది. ఏవో బొమ్మలు కనిపిస్తున్నాయి!

ఏదో టేప్ రికార్డర్‌లాగో, గ్రామఫోన్‌లాగో వుంది. గొంతులు వినిపిస్తున్నాయి.

నాగుండె దడదడ

దడదడ లాడింది.

గొంతు తడారిపోయింది. ఒంటిమీద రోమాలు నిక్కబొడుచుకున్నాయి!

ద్వంద్వాతీతమైన ఆనందానుభూతితో నా గురించి నేను మరిచిపోయి - చంద్రకాంత్ నాకోసం నా పరిశీలనకోసం పంపిన తన మనసును తిరగెయ్యడం ప్రారంభించేను.

చంద్రకాంత్ మనః ప్రపంచంలోకి ప్రవేశించేను.

అక్కడంతా నిగుళ్ళు దిగుళ్ళు

దిగుళ్ళు పగుళ్ళు

అన్నీ అతుకులు-చితుకులు—

అన్నీ చిన్న చిన్న విశేషాల - వివరాల—

అంతా గజిబిజి కలగాపులగం గందరగోళం......కాలం మా నవ జీవితంతో కలిపి చేసిన ఇంద్రజాలపు ముద్రలు......

"చంద్రకాంత్..."

"ఏమండీ మేష్టారూ!..."

"నువ్వుత్త వెర్రివాడివోయ్ ఎల్లా బతుకుతావో గాని .."

స్కూల్ మేష్టారుతో చంద్రకాంత్ మాటలవి.

ఇంకో మేష్టారుతో—

"నే వెళ్తాను మేష్టారూ! .."

"నీలాంటి అల్లుడు దొరికితే బావుణ్ణోయ్ నాకు ."

చంద్రకాంత్ తండ్రిగొంతు-"పిచ్చిదానా ఎందుకలా భయపడతావ్?-మనవాడు బుద్ధిమంతుడు-"

చంద్రకాంత్ తల్లిగొంతు- "చందూ!- పాలు తాగరా నాయనా!-"

నినర్ హైస్కూల్ కుర్రాడు—"ఇవాళ్తో నీకూ నాకూ చెడిందిరా చందూ......జన్మలో నీ ముఖం చూపించకు నాకు..."

ఇంకో కుర్రాడు—"చందూ! నీలా నేనూ పొడుగ్గా వుంటే బాగుణ్ణు..."

ఒక ఆడపిల్ల—"బావా! బావా! బొంగరం వెయ్యడం నేర్పవూ?-" ఈ మరదలిగొంతే మళ్ళీను "హో బావను నేను పెళ్ళి చేసుకోను-వూఁ-నేనెందుకు చేసుకుంటానూ?-చేసుకోను ఛీ! ..' సిగ్గుతో నవ్వు.

ఏదో మీటింగు-"కాబట్టి మీరంతా భావి భారత పౌరులనే సంగతి మీరు కలలో కూడా మరిచిపోకూడదు "

మైకులో ఎనౌన్స్‌మెంట్-"ఇంగ్లీష్ వ్యాసరచన పోటీ ఫస్ట్ ప్రయిజ్-కె. పి. చంద్రకాంత్-" చప్పట్లు చప్పుడు.

తండ్రిగొంతు-"ఒరే బాబూ నేను చచ్చిపోతే మీ అన్నా చెల్లెళ్ళ్ని కాపాడే బాధ్యత నీదే!......"

"నాన్నా! అవేం మాటలు నాన్నా!..."

రైల్వే స్టేషన్‌లో గంట.

ఏదో ఎక్స్‌ప్రెస్ రైలు చక్రాల రొద.

కాలేజీలో గంట.

హాస్టల్‌లో గంట.

సైకిల్ బెల్స్! కారు హారన్లు, లారీలు, బస్సులు చేసే ఘోర ఘోరు శబ్దాలు...

"మీదేవూరండీ? .." ఆడగొంతులాంటి మొగగొంతు.

"మీ ఇంగ్లీష్ డామా నోట్సొకసారిస్తారా?–" మొగగొంతు లాంటి ఆడగొంతు.

"మిస్టర్ చంద్రకాంత్! గెటౌటఫ్ ది క్లాస్!–" కర్కశమైన లెక్చరర్ గొంతు.

ఏవో సినిమాలోని డైలాగులు–

"ఎలా వున్నారు?–" (–స్త్రీ)

"బ్రతికున్నాను! " ( పురుషుడు)

ఇంకో సినిమ లోవి–

"ఎవరు బాబూ మీరు? -" (- నౌకరు,

"నేనెవరో నాకే తెలీదు!..." (- హీరో)

వొక సినిమాపాట

'నా హృదయంలో నిదురించే చెలీ!..."

దో గొంతు తాగుబోతు గొంతు–

'అది పక్కా నంబర్ వన్ సరుకురా–"

ఛెళ్'మనే శబ్దం! - చెంపదెబ్బ!

ఒంట్రిగాం–

'ఫాదర్ సీరియస్ స్టార్ట్ మిడియెట్లీ-"

తల్లిగొంతు -

'చందూ నా తండ్రి మీ నాన్న మనల్ని అన్యాయంచేసి రా..."

తల్లి ఏడుపు, చెల్లెలి ఏడుపు

ఎవరిదో పెద్దమనిషిగొంతు "ఆరువేలు పీవి కావమకో- సిద్దైపోతుం . ..."

కంగ్రాచ్యులేషన్స్, బ్రదర్!..." స్నేహితుడి గొంతు.

వొక ద్రు ... -తు (ఈ గొంతు మళ్ళీ మళ్ళీ వినిపిస్తుం

"ఫే ష ... మ వ్-"

"చందూ! - క్షమించండి మిమ్మల్నలా పిలవాలనిపించింది–"

"టక్ చేసుకుంటే మీరు బాగుంటారు......"

"మా నాన్నగారు నా పెళ్ళిగురించి తొందరపడుతున్నారు -"

"మీరు ఫుల్ వైట్‌లో చాలా బాగుంటారు–"

"మీరు పెళ్ళాడకపోతే నేనేమైపోతానో తెలీదు -"

–తరువాత ఆ స్త్రీగొంతు మళ్ళీ వినిపించలేదు.

"బాబూ! ఈ పెళ్ళి మవ్వు చేసుకుంటేనే నీ చెల్లెలికి పెళ్ళవుతుంది అంతకన్నా నేనేమీ చెప్పలేను–"

మంగళ వాయిద్యాల సవ్వడి...

చంద్రకాంత్ స్వగతాలు కూడా వున్నాయి. అతని మనస్సులో చాలా రికార్డులు వున్నాయి...ఎప్పటివో–ఏ సందర్భంలోనివో - పూర్తిగా తెలిసేట్టు లేవు. కాని, ఆలోచించి ఆరాతీస్తే అర్థం కాకపోవు.

– చందూ అని ఆ అమ్మాయి యెంత తియ్యగా పిలుస్తుంది. ఆ పెదవులెంత బావున్నాయి.

మా నాన్నను చూస్తే నా కసహ్యం (!)...

–చెల్లెలికి సెక్సంటే ఏమిటో తెలుసు. అది నాకు తెలుసని తెలుసు. ఇద్దరికీ తెలీనట్టు ఇద్దరూ నటించాలి......

–ఫ్రాయిడ్ చెప్పింది నిజమే!...

–జేమ్స్ జాయిస్‌ని చదివితే బాగుణ్ను

–ఎవరో ఆనర్సు పిల్ల!? ఆమె ధరించింది పేడెడ్ బ్రా అయి వుంటుంది...లేకపోతే అంత పొంకమెలా వొచ్చింది?

–జీనా లోలో బ్రిగిడా భలే మాట్లాడుతుంది...

–"ఫన్నీగర్ల్" చూస్తూ నేనెందుకు చచ్చిపోలేదు?–

–వొమర్‌షెరీఫ్ కుక్కపిల్లలా చూస్తాడు...

–లాక్మీ కెళ్ళాలనుంది. నాదీ మొగజన్మే......

–పెళ్ళయిన కొత్తలో అమ్మ యెలావుండేదో చూడాలని వుంది. కొత్త పెళ్ళికూతురుగా అమ్మ పీటలమీద ఎలా తలవంచుకుని ఎంతసిగ్గుతో ముడుచుకు కూచుందో చూడాలనుంది. కాని, ఎలా అది వీలౌతుంది? అసలప్పుడు నే నెక్కడున్నాను?

–కె. ఎస్. సుబ్రహ్మణ్యం చాలా బాగా రాస్తాడు. "అమర గణం"లో నేనే హీరోని.

–చలం "అరుణ"లో అరుణగానీ, "శశాంక"లో మధురవాణిగానీ, "చివరకు మిగిలేది"లో అమృతంగాని నిజ జీవితంలో తారసపడతారా? వీళ్ళలో ఎవరికోసమైనా - అవసరమైతే నేనేమైనా చేస్తాను......

—ఈ జీవితం బోర్‌గా వుంది.

—ఈ జీవితం బోర్ బోర్‌గా వుంది.

—ఈ జీవితం బోర్ బోర బోర్‌గా వుంది.

—నాకు చచ్చిపోవాలనుంది చచ్చిపోవాలనుంది నాకు ఉంది నాకు చచ్చిపోవాలని.

—ఆనందరావు కథలు బాగా రాస్తాడు. ఆయన్నిచూస్తే బాగుణ్ను. ఎలా వుంటాడో!......

—భారతమాత అంటారు! భారతపిత ఎవరో?

—వొళ్ళు మండితే నక్సలయిట్లలో జేరిపోతాను!

—ఆ ఎర్రచీర పిల్లని రేప్‌చేసేస్తే బాగుణ్ను. ఆ తరువాత జైలుకి పోయినా నష్టమేముంది?

—మా బాస్‌కి అన్నీ వున్నాయి-వొక్క బుద్ధి తప్ప—

చంద్రకాంత్ మనసులో ఇంకోమూల - ఇంకో కొన్ని ప్రతిధ్వనులు - కొన్ని కొన్ని ఆవేశాలను పలికించే గొంతులు ... ...

భార్య—"అంతిష్టం లేకపోతే ఎందుకు చేసుకున్నారు నన్ను?"—

"మావాళ్ళను తిడితే బావిలోదూకి చస్తాను—"

"ఎంత మంచివారండీ మీరు—"

"—మీకే బుద్ధి లేదు..."

"నేనీ కాపరం చెయ్యలేను—'

తల్లి —

"అన్నీ తండ్రిపోలికలేగా నీకు-వొట్టి చాతకాని వాడివి-"

"బాబూ! నువ్వు నూరేళ్ళు చల్లగా బ్రతకాలి..."

చెల్లి —

"పోరా ఫూల్ !..."

"తంతాను-ఏమనుకున్నావో !..."

"వొదిన అదృష్టవంతురాలురా అన్నయ్యా !..."

ఆఫీసర్ —

"ప్లీజ్ !-ఏమనుకోకండి... ..."

"ఈ ఆఫీసులో కుర్రసన్నాసులక్కూడా రోషాలే !..."

మరో[illegible] స్వగతాలు - ఇంకోమూల మారుమ్రోగేవి

—ఏమిటో ఈ జీవితం అయోమయంగావుంది...

—చచ్చిపోతే బాగుణ్ను—

— ప్రయత్నించలేదుగానీ... నేనూ సినిమా హీరోనైపోయేవాణ్ణేమో!... ...

— దేశం నాశనమైపోతోంది.

— వొక రెండువేల పేజీల నవలరాసి విశ్వనాథ సత్యనారాయణ గారికి అంకితం ఇవ్వాలి. దానికి శ్రీ శ్రీ పీఠిక రాయాలి.

— ముప్ఫై ఆరు అంగుళాలు మించి పొట్ట వున్న శాసన సభ్యులచేత మంత్రులుగా ప్రమాణస్వీకారం చేయించబడదు · అని వొక శాసనం వొస్తే బాగుణ్ను,

—జీవితం...అంటే ఏమిటి ?

—ప్రళయమొస్తే బాగుణ్ను.

—ప్రపంచ యుద్ధమైనా వొస్తే బాగుణ్ను.

—కమ్యూనిస్టు నియంతృత్వమైనా వొస్తే బాగుణ్ను.

—నేనే వో, హెన్రీనైతే — జాక్ లండన్నయితే — టి. ఎస్. ఈలియట్ నయితే ?.. ఇడియట్‌నైతే ?...డోస్టోయెవ్‌స్కీనైతే? —

—నేను ఇడియట్‌నే!

—గెడ్డాలు పెంచిన వాళ్ళంతా దొంగలు గెడ్డాలు పెంచని వాళ్ళంతా దొంగలు...

—రాజీవం ఇప్పుడెక్కడుందో ? ఇప్పుడు సరిగ్గా-ఇప్పుడు - ఏంచేస్తూంటుందో ?...

—ఆఫీసర్లులేని ఆఫీసులుఉండేకాలం ఎప్పుడొస్తుందో?!......

—ఈ జీవితంలో ఎవ్వర్నీ నమ్మకూడదు, వొక్కర్నికూడా నమ్మకూడదు. తల్లినీ, తండ్రినీ, పెళ్ళాన్నీ, కూతుర్నీ, కొడుకునీ ఫ్రెండునీ, ఆఫీసర్నీ, కిళ్ళీకొట్టువాణ్ణీ. హోటెలు సర్వర్నీ, థియేటరో బుకింగ్ క్లర్క్‌నీ, లాడ్జిలో వేశ్యనీ, బట్టల కొట్లో సేల్స్‌గర్ల్‌నీ టూరిస్ట్‌గైడ్‌నీ, బస్సు కండక్టర్నీ, పళ్ళ డాక్టర్నీ, బిల్ కలెక్టర్నీ టికెట్ కలెక్టర్నీ, జిల్లా కలెక్టర్నీ, అప్పుతీసుకున్నవాణ్ణీ, అప్పిచ్చిన వాణ్ణీ, పలకరించినవాణ్ణీ, పలకరించనివాణ్ణీ, ఇంగ్లీషొచ్చినవాణ్ణీ ఇంగ్లీషు రానివాణ్ణీ, పోలీస్ వాణ్ణీ, ఫైర్ స్టేషన్‌వాణ్ణీ, తపాలా బంట్రోతునీ, స్టాంపు వెండర్నీ, బార్‌లో సీసాలందించే బోయ్‌నీ, గుండు కొట్టుకుని నామాలెట్టుకునే పూజార్నీ అన్నట్టు బార్బర్నీ, టైలర్నీ, వాషర్‌మన్నీ,— పూఁహుఁ - ఎవ్వర్నీ ఎప్పుడూ నమ్మకూడదంటే నమ్మకూడదు.

–నీ నీడని నువ్వే నమ్మకూడదు.

–దేవుణ్ణిమాత్రం అసలే నమ్మకూడదు !!!

–లోకమంతా స్త్రీయలిస్టుల మయమ్మైతే ఏమౌతుంది ?

–ఉలగం శవళవుదాన్

–పయనించే మన వలపుల బంగరు నావా

–పడవ ప్రమాదంలో చచ్చిపోయిందెవరు ? కీట్సా ? షెల్లీయా ?–పడవలిక్కూడా చక్రాలుంటే బాగుణ్ణు

–గోని పట్టాలో కాళ్ళుదూర్చి పట్టాలమీద చెట్టాపట్టా లేసుకుని నువ్వూ, నేనూ రెక్కమూన్లకేసి చూడకుండా, స్టేషన్వొచ్చినా ఆగకుండా, నీ నవ్వులు నేనూ, నా నవ్వులు నువ్వూ మార్చి మార్చి నవ్వుకుంటూ లోకాన్ని మార్చి ఏప్రిల్ నవయౌవన శోభల రహస్యాల రమ్యతమస్సుల్ని – తమో యవనికల్ని తొలగించి మన పూర్వజన్మల బంధాల్ని, అనుబంధాల్ని వెచ్చగా పెంచువేసుకుందామా ? –

ఫ్రెయిలిటీ దై నేమ్ ఈజ్ వుమన్

– ఫూల్ కిల్ తేహై–లోగ్ మిల్ తేహై–

–సుమిత్రానందన్ పంత్ మహాకవి

–వీని, విడి, విసి (Vini, Vidi, Vici) అన్నదెవరు ? అలెగ్జాండరేనా ? జూలియస్సీజరా ?–

–సుభాస్చం దబోస్ ఇంకా బతికున్నాడంటే నమ్మేవాళ్ళున్నారు నేనెప్పుడో చచ్చిపోయినా బాబులూ అంటే వొక్కరూ నమ్మరు–

–ఆడపిల్లల్ని ప్రేమించకూడదు. మొగపిల్లల్నికూడా ప్రేమించకూడదు అంతకన్నా పిల్లుల్ని ప్రేమించొచ్చు, కుక్కల్ని ప్రేమించొచ్చు, గాడిదల్ని, పందుల్ని, పందికొక్కుల్ని, యెలకల్ని–వేటిన్నైనా ప్రేమించొచ్చు, కాని ఆడపిల్లల్నిమాత్రం ప్రేమించకూడదు–

–బుద్ధుంటే... ...

–హైలెండ్ ఛీఫ్ విస్కీ బాగుంటుంది.

"ఏమండీ–మీరీమధ్యన చాలా చిక్కిపోతున్నారు–"

"పోతేపోయేన్లే–"

"ఏమ్మాటలండవి ? – నేనింకా బ్రతికున్నాను–"

– లోకంలో పెళ్ళామంత చెడ్డదిలేదు. లోకంలో పెళ్ళామంత మంచిదిలేదు.

"నేనంటే మీకెందుకండీ అంత అసహ్యం ?..."

"... ... ..."

"నాకు తెలుసులెండి–మొదట మీరెవర్నో వేరే అమ్మాయిని ప్రేమించేరు...ఆవిడ వొప్పుకోలేదనీ నన్ను చేసుకున్నారంతే!... మీకు నామీద ఎప్పుడూ లేదు..."

–ఏవిటి ఉండేది ? గోంగూర ! ?

–ఫెమినైన్స్ ఫూల్స్ అన్నమాట నిజమే ?

"ఆ చంద్రకాంత్ వున్నాడే!...వాడికి బలే సుపీరియారిటీ కాంప్లెక్సు–"

–నాకు సుపీరియారిటీ కాంప్లెక్స్ అన్నవాడొట్టి స్టుపిడ్. స్టుపిడ్స్ అంతంగా వుంటే వుండొచ్చుగాక, కాని వాళ్ళకి సుపీరియారిటీ అంటే ఏవిటో–కాంప్లెక్స్ అంటే ఏవిటో... ... తెలియాలని ఎక్కడుంది?

"హో హోయే హోయే చినదానా నీ

తీయని మనసూ నాదేనా"

–ఆడవాళ్ళకు మనసులుండునా ?

–మావ్మ్ మిసోజినిస్ట్, కాదా?

–మావ్మ్ వొక వినిగ్మా అంటారు–నిజమా ?

–మావ్మ్ వొక నాన్సెన్స్ రచయిత, అంతే! (!) వోన్లీ థింగ్ ఈజ్ దట్ దిగ్రై వోన్ది ట్రిక్స్ ఆఫ్ హిజ్ ట్రేడ్ !...

–యూ వోన్లీ లివ్ వన్స్ ! యు వోన్లీ లివ్ ట్వైస్ ! నేనంటాను–యునెవర్ ఆక్చువల్లీ లివ్–యు ఆర్ డెడ్ ది మొమెంట్ యు ఆర్ బోర్న్ !...అండ్ యు ఆర్ రియల్లీ బోర్న్ ది మొమెంట్ యు ఆర్ డెడ్–

–జాతస్యహి ధ్రువోర్మృత్యుర్ధ్రువో జన్మ మృతస్యచ... ... నిజానికి జీవితమే మృత్యువు మృత్యువే జీవితం... ...

చంద్రకాంత్ మనసు అడుగు పొరల పొరుగులలో ఎన్నో గొంతులున్నాయి–అతని గొంతు–అతని గొంతేకూడా ఎన్నో రకాలుగా ఎన్నో రసాలనీ, భావాలనీ మీటిన దాఖలాలున్నాయి. చంద్రకాంత్ మనసు అందరి మనసుల్లాంటి మనసే ! చెదిరిపోయే మనసు. బెదిరిపోయే మనసు. రాయిలా మొండిగా నిలబడే మనసు. వెన్నలా కరిగిపోయే మనసు.

ఇంకా ఏముంటుందో అనే ఆతురతతో చంద్రకాంత్ మనసుని తిరగేసి మరగేసి క్రిందుమీదుచేసి అతి జాగ్రత్తగా పరీక్షించేను. చెప్పలేదూ ? చంద్రకాంత్ మనసుని తాకగలను. స్పర్శకి ఎలా వుంటుందో – చెప్పడంమాత్రం వీలుపడదు. అసలే అది మనసుతో వ్యవహారం !

చంద్రకాంత్ మనసులో చాలా గాయాలు కూడా వున్నాయి—

మూడు గాయాలు—ఆడపిల్లలు చేసినవి.

అందులో వొక గాయంలోంచి రక్తం ఇంకా కారుతోంది!

పెళ్ళాం—మాటలతో చేసిన గాయాలు కొన్ని వున్నాయి. వాటికిమాత్రం చక్కగా బ్యాండేజీలు కట్టుకుని వున్నాడు చంద్రకాంత్. ఆ గాయాలకి పక్కనే వొక చిన్న చీటీ (!)మీద—"పెళ్ళి అంటే ఎప్పటికప్పుడు బ్యాండేజీలు కట్టుకుంటూ వుండడమే..." అని రాసి వుంది. (చంద్రకాంత్ చేతివ్రాత అందంగానే వుంటుంది.)

తల్లి చేసిన గాయాలు రెండుమూడున్నాయి—చంద్రకాంత్ మనసులో! కాని, అవి దాదాపు మానిపోవస్తున్నాయి!

ఇంకా ఇతర మనుష్యులు చేసిన గాయాలు చాలా వున్నాయి. కొన్ని మరీ చిన్నవి, కొన్ని మరీ పెద్దవి!

మరీ చిన్న గాయాలవల్ల చంద్రకాంత్ మరీ ఎక్కువగా బాధ పడినట్టు తెలుస్తోంది.

చిన్నగాయాల లోతెక్కువ.

సంఘం చేసిన గాయాలున్నాయి. ఉద్యమాలవల్ల, పోలీసు కాల్పులవల్ల, పేపర్లోని విషాద వార్తలవల్ల—కలిగిన గాయాలు అతని మనసులో బోలెడున్నాయి—

ముళ్ళుదిగి కొన్ని, గునపాలుదిగి కొన్ని, చూపులు దిగబడి కొన్ని, మాటలు వేటాడి కొన్ని, చేతలు చెండాడి కొన్ని, నమ్మకాలు చెదిరిపోయి కొన్ని—

అవడం ఏలాగైతేనేం?—లెక్కలేనన్ని గాయాలు!!

అయితే—వీటినన్నిటినీ చంద్రకాంత్ ఎలా భరిస్తున్నట్టు?—

గాయాల కనుమదాటి—

దాని పక్కనేవున్న కోనలోకి తొంగి చూసేసరికి—

ఓ!—

తెలిసిపోయింది!

ఈ మనసుకి అన్ని గాయాలని భరించే శక్తెలా వొచ్చిందో తెలిసిపోయింది!

గాయాల కనుమ పక్కనేవున్న పచ్చాపచ్చాటి కోనలో—

పువ్వులున్నాయి, నవ్వులున్నాయి. పిట్టలున్నాయి. అవి పాడుతున్నాయి, లేళ్ళు బేల చూపులు చూస్తున్నాయి, అశల ఆషాఢ మేఘం అప్పుడే వివదించినట్లు ఆశయాల మయూరాలు జివిసత్ బర్హం విప్పి నాట్యంచేస్తున్నాయి...ఆ కోనలో ఆరు ఋతువులూ వున్నాయి. ఆరు ఋతువుల అందాలూ ఆనందాలూ అందులోనే వున్నాయి. వుండీ వుడిగీ రెండు కోయిలలు "కూ" "కుహూ"లతో మంతనాలాడుకుంటున్నాయి.

అయితే చంద్రకాంత్ మనసులోని ఈ పచ్చాపచ్చాటి కోనలో—ఏ నవ్వులు పువ్వులై పూసేయి? ఏ చల్లని మాటలిక్కడ పాటలై మ్రోగేయి??

"చందూ నువ్వు మంచివాడివి నువ్వు మంచి వాడివి" అంటూ నవ్వుతూ పలికిన చిన్నారి బాల్యస్నేహితురాలు "ఎప్పుడూ నా జట్టుండవూ నువ్వు నా జట్టుండవూ?" అంటూ చేతిలో చేయి వేయించుకుని స్నేహానికి ప్రమాణపత్రం ఆ రకంగా రాయించుకున్నాననుకున్న అమాయకురాలు—ఆ చిన్నారి పాప నవ్వు ఆకలీ సెక్సూ—దారిద్ర్యం—పొలిటిక్సూ—పాపులేషన్ గ్రోతూ—వగైరా వగైరా చెత్త చెదారం పేరుకోని చంద్రకాంత్ మనసులో అలనాటి ఆ అమృతమయి నవ్వులు పోసి పెంచి పెద్ద చేసిందే స్నేహపారిజాతం పరిమళము చెడదు నాడదు పరువము తప్పదు పరాగ భారభరితమై నిరతం మనోహరమైనది—ఆ బంగారు బాల్యపు స్మృతి.........చంద్రకాంత్ మనసులో ఆ పచ్చాపచ్చాటి కోనలో—ఆ పారిజాత ప్రసూన పరిమళం........

ఏప్పుడో వొకసారి తండ్రియొక్క స్వంతవూరికి పల్లెటూరికి చంద్రకాంత్ వెళ్తే—అతణ్ణి చూసి భోరున ఏడ్చేసి కావలించుకుంది ముసలవ్వ......రామాయణంలో శబరే అనిపించింది—"నా తండ్రీ విస్సిరాదం కొడుకువా నువ్వు—మీ నానమ్మను ఈ చేతులో పెంచేను మీ నాన్నకు ఈ కాళ్ళమీద స్నానాలు చేయించేను—అందరూ పోయేరు అంతా పోయింది. ఇన్ని దినాలకి నిన్ను చూసుకోడానికే నిలిచుందేమో ఈ కళ్ళు—నా బంగారు తండ్రీ!..." అంటూ ఇంటికి తీసుకెళ్ళి తను స్వయంగా అప్పుడు పొయ్యి రాజేసి సజ్జరొట్టెలు చేసి పెట్టింది "నా బంగారు తండ్రీ—పిల్లా పాపల్తో వెయ్యేళ్ళు చల్లగా వర్ధిల్లు—" అని వొణికే చేతుల్తో, వొణికే గొంతుతో దీవించి పంపింది... ఆ నిండు మనసుగల ముసలవ్వ దీవనలే చంద్రకాంత్ మనసులో నిత్యం మొలకెత్తే నందివర్ధనాలు! చలువల నందివర్ధనాలు!!

ఎన్నిసార్లు ఎన్ని దెబ్బలాటలాడినా మళ్ళీ పశ్చాత్తాపంతో భర్తకి క్షమాపణలు చెప్పుకుంటూ "ఆలోచన పాలోచనా లేనిదాన్ని—మిమ్మల్ని ఎంతెంతలేసి మాటలన్నా కోప్పడలేదు మీరు ఎంత మంచివారు—" అని గుండెల్లో తలదూర్చే ఇల్లాలి అనురాగం నిండిన చూపులవల్ల—చంద్రకాంత్ మనసులో తెలిమల్లెలే! విరజాజులే!

ఏ కష్టమొచ్చినా ఎప్పటికప్పుడు ఆదుకుంటూ "పోనిస్లేరా భాయ్ నువ్వేం ఇదవకు–" అని భుజం తట్టే ఆప్తమిత్రుడు కుమారస్వామి చెయ్యి చంద్రకాంత్ మనసులోని ఆ పచ్చాపచ్చటి కోనలోని గులాబీ మొక్కలకి నిత్యం నిత్యం కొత్తపూలు పూయిస్తూ వుంటుంది……

గాయాల కనుమలే కాదు నవ్వుల పువ్వుల పచ్చాపచ్చాటి కోనలే కాదు చంద్రకాంత్ మనసులో వొక పెద్ద తెరవుంది. వెండితెరమీదికయితే ఎక్కణ్ణుంచో చేసే ఫోకస్‌వల్ల బొమ్మలు పడతాయి. ఇక్కడలా కాదు. ఈ తెరమీద బొమ్మ వొకసారి పడితే - మళ్ళీ చాలా దినాల వరకూ అది మాసిపోదు కొన్ని బొమ్మలయితే ఆమరణాంతం మాసిపోవు. ఈ తెర నిజంగా విచిత్రమైన తెర. దీనిమీద ఎన్ని బొమ్మలు ఎంత గాఢంగా ముద్రితమైనా ఇంకా ఇంకా కొత్త బొమ్మలకి ఎప్పుడూ చోటు వుంటూనే వుంటుంది……

(ఇంకా వుంది)

# ఆ గది

## శ్రీ వేలవూరి ప్రసాదరావు

ఆ గదిలోకి–
అంత పెద్ద భవంతి తన గుండెల్లో దాచుకొని
ఎంత పెద్ద వాళ్ళకూ ప్రవేశం కలిగించని
ఆ గదిలోకి–
హఠాత్తుగా లేచి అతడు వెళ్ళిపోతాడు.

ఎవరో అతణ్ణి అకస్మాత్తుగా, అధికారికంగా పిల్చినట్టు
రాచకార్యాలు మునిగి పోతున్నట్టు
అందర్నీ అవతలే వొదిలేసి
హఠాత్తుగా లేచి అతడు వెళ్ళిపోతాడు.

అతడు మాత్రమే అడుగు పెట్టటానికి వీలున్న ఆ గదిని
ఇతరులు చూడలేదంటే ఏమీ విడ్డూరంలేదు.
పెళ్ళాం ప్రవేశించలేక పెదవి కొరుక్కుంటున్నా,
పిల్లలు తలుపులమీద గట్టిగా తడుతూన్నా,
అతడు కదలడు—ఆ గది తలుపు తియ్యడు.

బయటనుంచున్న మా మనస్సులలో
పరిపరి విధాల ఆలోచనలు
బరిమీది పాముల్లా గిరికీలు కొడతాయి.

అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడితో ఆ గదిలో మాటాడి
ఆత్మరహస్యాన్ని అవగతం చేసుకుంటున్నాడా?
వైకుంఠపురీ విభవాన్ని విజ్ఞాన మధువుగా చేసుకుని
మనఃపాన పాత్రలో మళ్ళీ మళ్ళీ పోసుకు తాగుతున్నాడా?
అనంత సౌందర్యరాశిని ఆ గదిలో దాచివుంచి
ఆర్ద్ర పరిరంభాలతో అప్పుడప్పుడు అలరిస్తున్నాడా?
అతడికి మాత్రమే తెలుసు కిటికీలు లేకపోయినా
ఆ గదిలో గాలివీస్తుందని.
అతడికి మాత్రమే తెలుసు అంధకార బంధురమైనా
ఆ గదిలో ఆశాదీపాలు వెలుగుతాయని.
అతడికి తెలుసు ఆ గదిలో అడ్డకట్టు విరిగిన
కొయ్యగుఱ్ఱాన్ని చూచి కొందరు నవ్వుతారని.
అతడికి తెలుసు ఆ గదిలో రంగు వెలిసిన
లక్కపిడతల్ని చూసి జనం వెక్కిరిస్తారని.
అందుకే అతడు ఆ గది తలుపులు తెరవడు
తొందరలో కూడా గడియపెట్టడం మరువడు.

బ్రతుకు గ్రీష్మంలో బడలి వాడిలిన జీవన లతను
బాల్య స్మృతుల తొలకరిజల్లులతో బ్రతికించుకోవాలనీ,
అబద్ధాల ఆడంబరాల అంబరాల అట్టడుగున
అమాయకపు తన తొలినాటి రూపు అవలోకించాలనీ,
అర్థంకాని వేదాంతాల అనర్థ ఖాతాంతరాలల్లో
అనుభూతితో స్పందించే తన మనస్సును మళ్ళీ స్పృశించాలనీ,
ఆవేశాల కావేషాల అసమర్థపు జీవిత యాత్రలో
అలసినా తన బ్రతుకింకా అంతం కాలేదనీ
మనస్సుతో విశ్వసించి మళ్ళీ మననం చేసుకోవాలని
ఆ గదిలోకి హఠాత్తుగా లేచి అతడు వెళ్ళిపోతాడు.
అందుకే అతడు ఆ గదితలుపులు తెరవడు;
తొందరలో కూడా గడియపెట్టడం మరువడు.